Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 139 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 7 - 12 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# భారత్ ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పాక్ ఆర్మీనే కారణం



**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ ఆర్మీని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విమర్శించారు. భారత్ ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పాక్ ఆర్మీనే కారణమని అన్నారు. పాక్ ఆర్మీ భారత్‌పై సైద్ధాంతిక శత్రు త్వానికి పాల్పడుతోందన్నారు. 'ఉగ్రవాదం, ఉగ్రవాద శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయడం వంటివి చూసినప్పుడు వారు ఇండియా పట్ల శత్రుత్వ విధానాన్ని అనుసరించడం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఇదంతా చేస్తున్నదెవరు? ఆర్మీనే' అని జైశంకర్ చెప్పారు. అయితే పాక్ నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురైనా దానిని ఎలా ఎదుర్కోవాలనేది న్యూఢిల్లీ చూసుకుంటుందని చెప్పారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునిర్ గురించి మాట్లాడుతూ, టెర్రరి స్టుల్లో మంచి టెర్రరిస్టులు, చెడు టెర్రరిస్టులు ఉండనట్టే మంచి మిలటరీ నాయకులు, చెడ్డ మిలటరీ నాయకులు అని ఉండరని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై మాట్లాడుతూ, భారత్ నిర్దిష్ట నియ మాలు, నిబంధల కింద ఆపరేషన్ చేపట్టిందనన్నారు. ఎలాంటి చర్య తీసుకున్నా దేశానికి, దేశ ప్రజలకు, మీడియాకు, సివిల్ సొసైటీకి జవాబుదారీగా నిలిచిందని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీ కారంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌పై విరుచుకుపడింది. పాకిస్థాన్‌లోని తొమ్మిది ప్రాంతాల్లో 24 క్షిపణి దాడులు జరిపింది. 70 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. మరో 60 మంది ఉగ్ర వాదులు గాయపడ్డారు. దీంతో పాకిస్థాన్ ఎల్‌ఓసీ వెంబడి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. మే 10న ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి.

# శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు.. సీఎం చంద్రబాబు ఫైర్



**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి భక్తుల మనోభా వాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయని ఫైర్ అయ్యారు. శనివారం అమరావతిలోని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాల యానికి సీఎం చంద్రబాబు వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో పలు కీలక అంశాలపై మాట్లాడారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు చిట్ చాట్ చేశారు. శ్రీవారి పరకామణి దొంగతనం వ్యవహారంపై జగన్ వ్యాఖ్యలను ప్రస్తావించారు మీడియా ప్రతినిధులు. పరకామణి దొంగతనం చిన్న దొంగతనం అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు అందరినీ విస్తుగొలిపాయని చెప్పుకొచ్చారు. జగన్‌కు దేవుడి అన్నా లెక్కలేదని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేంకటేశ్వర స్వామి భక్తుల మనో భావాలు అన్నా లెక్కలేదని... ఆలయాలు పవిత్రత అన్నా లెక్కలేదని ధ్వజమెత్తారు.

# విమాన ఛార్జీల పెంపుపై కేంద్రం ఆగ్రహం

**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో విమాన టికెట్ల ధరల పెంపుపై కేంద్రం రంగంలోకి దిగింది. విమాన ఛార్జీలను పెంచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది కేంద్ర విమానయాన శాఖ. ఇండిగో ఫ్లైట్స్ రద్దైన మార్గాల్లో ధరలను క్రమబద్ధీకరించాలని సూచించింది. దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభం నేపథ్యంలో.. కొన్ని విమానయాన సంస్థలు ఆసరాగా తీసుకోవడంతో టికెట్ ధరలకు రెక్కలొచ్చాయి. ఇలా ఇష్టానుసారంగా ధరలు పెంచడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన విమానయాన శాఖ.. ఛార్జీలు పెంచితే ఊరుకునేది లేదని హెచ్చరించింది. ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్త వహించాలంది. కొత్తగా నిర్ణయించిన ఛార్జీలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది.




# విమాన ఛార్జీల పెంపుపై కేంద్రం ఆగ్రహం

**ఇంటర్నెట్ డెస్క్:** దేశంలో విమాన టికెట్ల ధరల పెంపుపై కేంద్రం రంగంలోకి దిగింది. విమాన ఛార్జీలను పెంచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది కేంద్ర విమానయాన శాఖ. ఇండిగో ఫ్లైట్స్ రద్దైన మార్గాల్లో ధరలను క్రమబద్ధీకరించాలని సూచించింది. దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభం నేపథ్యంలో.. కొన్ని విమానయాన సంస్థలు ఆసరాగా తీసుకోవడంతో టికెట్ ధరలకు రెక్కలొచ్చాయి. ఇలా ఇష్టానుసారంగా ధరలు పెంచడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన విమానయాన శాఖ.. ఛార్జీలు పెంచితే ఊరుకునేది లేదని హెచ్చరించింది. ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడకుండా జాగ్రత్త వహించాలంది. కొత్తగా నిర్ణయించిన ఛార్జీలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది.




# విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తాం : పవన్ కల్యాణ్




**అమరావతి, (రాజధాని వార్తలు):** విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకు రావాలనే ధృడ సంకల్పంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు డిప్యూటీ సీఎం. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో, అధునాతన సదుపాయాలు కల్పించి, పోషక ఆహారాన్ని, నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషికి అభినందనీయమని ప్రశంసించారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసేలా నిర్వహిస్తున్న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్స్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు.


# డా.బి.ఆర్.అంబేద్కర్‌కి ఘన నివాళులు




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రపంచ మేధావి, భారతరత్న, భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని రవాణాశాఖ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బందరు రోడ్డులోని ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలోని డా.బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి 69వ వర్ధంతి సందర్భంగా ఏపీ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ గారి వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డా.బిఆర్ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జె.రామ్ కుమార్, ఆర్. ప్రవీణ్ సంఘ సభ్యులు, రవాణా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# డా.బి.ఆర్.అంబేద్కర్‌కి ఘన నివాళులు







**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రముఖ మేధావి, న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల సమాజిక న్యాయం కోసం పోరాడిన డా. బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 డిసెంబరు 6న మహా పరినిర్వాణం పొందారు. స్వతంత్ర భారతదేశపు మొట్ట మొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఆయన అనేక సంస్కరణలు చేపట్టారు. ఆధునిక భారతదేశాన్ని రూపొందించడంలో ఆయన పాత్ర మరువరానిది. ఆయనకు 64 డిగ్రీలున్నాయి. కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి., లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి (డాక్టరేట్) పట్టాలను పొంది అరుదైన గౌరవాన్ని సంపాదించాడు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశాడు. న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా దేశానికి దిశా నిర్దేశం చేశాడు. విద్యార్థి దశలో కేవలం 32 ఏళ్ల వయసు ఉన్నప్పుడు డాక్టర్ అంబేద్కర్ రాసిన ఓ పుస్తకం భారత ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభంగా నిలిచింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ డిగ్రీ కోసం ఆయన చేసిన పరిశోధనే ఈ పుస్తక రూపంలో ఆవిష్కృతమయింది.ఆ పరిశోధనలో భాగంగా 1923లో లండన్‌లో వెలువరించిన "ద ప్రాబ్లమ్ ఆఫ్ రూపీ" పుస్తకం భారత, బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థల బలపడడానికి సహకరించింది. దీనిపై జరిగిన చర్చలు అనంతర కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు బాటలు పరిచాయి. భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'ను ఆయన మరణాంతరం 1990లో ప్రకటించింది. 2012లో ది హిస్టరీ ఛానల్, రిలయన్స్ మొబైల్ భాగస్వామ్యంతో అవుట్ లుక్ మ్యాగజైన్ నిర్వహించిన ది గ్రేటెస్ట్ ఇండియన్ పోల్‌లోఅతను మొదటి స్థానంలో ఎంపికైయ్యాడు. భారత రాజ్యాంగ సభకు కమిటీ ఛైర్మన్‌గా, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాన్ని పెంపొందించడంలో డాక్టర్ అంబేద్కర్ అవిశ్రాంతంగా కృషి చేశారు. బౌద్ధం ప్రాథమిక భావనలలో పరినిర్వాణ స్థితి ఒకటి. మహాపరినిర్వాణం పాళీ భాష నుంచి వచ్చింది. మరణించిన తర్వాత మోక్షం లేదా స్వేచ్ఛను పొందిన వ్యక్తిని ఇది సూచిస్తుంది. "నేను హిందువుగా పుట్టినా.. హిందువుగా చనిపోను" అని ప్రకటించి, నాగపూర్‌లో 1956 అక్టోబరు 29 నాడు తలపెట్టిన బౌద్ధ ధర్మ దీక్షా సదస్సులో అంబేద్కర్, 5 లక్షల మంది అనుచరులతో బౌద్ధ ధర్మమును స్వీకరించాడు. ముందుగా త్రిశారణం, పంచాశీల స్వీకరించి 5 లక్షల మందికి 22 ప్రతిజ్ఞలతో బౌద్ధ ధమ్మముని ఉపదేశించాడు. బౌద్ధంలోకి మారిన రెండు నెలలలోపే ఆయన మరణించారు. ఆయన మరణం దేశానికి పెద్ద నష్టమని, దేశ చరిత్రలో ఒక దురదృష్టకరమైన రోజుగా వివిధ రంగాల ప్రముఖులు ప్రకటించారు. డిసెంబరు ఆరున అంబేద్కర్ చనిపోయారనే వార్త దావానంలో వ్యాపించింది.వేలాది మంది అంబేద్కర్ అనుచరలు ఢిల్లీలోని ఆయన నివాసం వైపుగా బయలుదేరారు. అంబేద్కర్ అంత్యక్రియలు బొంబాయిలో జరగాలని కోరినట్లు సవితా అంబేద్కర్ చెప్పారు. ఢిల్లీలోని అంబేద్కర్ నివాసానికి నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ఇతర మంత్రులు.. పార్లమెంటు ఉభయ సభల ఎంపీలు వచ్చి నివాళులర్పించారు. అంబేద్కర్ మృతదేహాన్ని బొంబాయి తీసుకువెళ్లడానికి జగ్జీవన్‌రామ్ విమానాన్ని ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని నాగ్‌పూర్ మీదుగా బొంబాయికి తరలించారు. బొంబాయిలో జరిగిన అపూర్వమైన అంతిమయాత్రను దేశమంతా చూసింది. ముంబైలోని వస్త్ర పరిశ్రమ కార్మికులంతా ఆయన పార్థీవ దేహాన్ని చూసేందుకు రోడ్లపై బారులు తీరారు. అక్కడక్కడ తొక్కిసలాట జరిగింది. ఒక వ్యక్తి చనిపోవడం జరిగింది. ముంబై విమానాశ్రయంలో ఆయనను చూడటానికి 5 వేల మంది వచ్చారు. కార్మికులంతా రోడ్లపైకి చేరుకోవడంతో యాజమాన్యాలు సెలవు ప్రకటించాల్సి వచ్చింది. ఆయన అంతిమ యాత్రలో 50 వేల మంది పాల్గొన్నారు. ప్రజల రద్దీ తీవ్రంగా ఉండటతో రాత్రి 7.30 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో ఆయన కుమారుడు యశ్వంత్ రావు చితికి నిప్పంటించారు. ఆయనకు కడసారి దర్శించి నివాళులర్పించేందుకు 5 లక్షల మంది చేరుకున్నారని ముంబై పోలీసులు తెలిపారు.

# "భద్రాచలంలో ఫుట్‌బాల్ గర్జన - కూటమి అభ్యర్థి హరిశ్చంద్ర నాయక్ ప్రచారానికి ప్రజల భారీ స్పందన"





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పంచాయతీ ఎన్నికల వేళ పట్టణం మొత్తం రాజకీయ వేడి పట్టిపారేస్తున్న కూటమి ప్రచారంలో, టీడీపీ–జనసేన బలపరుస్తున్న బీజేపీ కూటమి అభ్యర్థి భానావత్ హరిశ్చంద్ర నాయక్ ఈరోజు 5, 6వ వార్డుల్లో నిర్వహించిన ప్రచారం భారీ ఉత్సాహంతో సాగింది. ప్రతి ఇంటిని సందర్శించిన నాయక్ తన ఫుట్‌బాల్ గుర్తును ఓటర్లకు గుర్తు చేస్తూ, భద్రాచలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చే కార్యక్రమాలను స్పష్టంగా వివరించారు. ప్రజలలో విశేష చర్చనీయాంశంగా మారిన విషయయి తాను గెలిస్తే తన గౌరవ వేతనాన్ని పంచాయతీ అభివృద్ధికే కేటాయిస్తానని ప్రకటించడం. ఈ హామీ వార్డులవరకే కాక పట్టణం మొత్తం రాజకీయ వాతావరణాన్ని కుదిపేసింది. అదేవిధంగా, 5వ వార్డు అభ్యర్థి భాగ్యలక్ష్మి (గుర్తు: గౌను), 6వ వార్డు అభ్యర్థి అబ్బినేని వినీల రాణి (గుర్తు: గౌను) తమ వార్డుల్లో శక్తివంతమైన డోర్–టు–డోర్ ప్రచారంతో ప్రజాభిమానాన్ని సొంతం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అలాగే కూటమి నేతలు కొడాలి శ్రీనివాస్, తాళ్లూరి చిట్టిబాబు, కుంచాల రాజా రామ్, కుంజా సంతోష్, పసుమర్తి సతీష్, ముత్యాల శ్రీనివాస్, ములిశెట్టి రాంమోహన్ రావు, కోట్ల దుర్గా ప్రసాద్, పోటు వెంకటేశ్వర్లు, కనిశెట్టి నరేష్, ఆకుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరికెల తిరుపతిరావు ప్రచారంలో దూకుడు!

## - పార్టీ అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తూ ముందుకు





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థల ఎన్నికల వేళ, 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అరికెల తిరుపతిరావు తన ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. తిరుపతిరావు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను ఆలకిస్తూ, తన గెలుపును ఆకాంక్షిస్తున్నారు.

**అభివృద్ధి నినాదంతో ముందుకు...**

ప్రచారంలో భాగంగా అరికెల తిరుపతిరావు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తు. పార్టీ యొక్క లక్ష్యాలు, స్థానికంగా తాము చేయబోయే పనులు, పారదర్శక పాలన ఆవశ్యకత గురించి ఆయన ప్రజలకు తెలియజేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడింది. అధికారంలోకి వచ్చాక పార్టీ చేసిన అభివృద్ధి పనులు మీ కళ్లెదుటే ఉన్నాయి. 14వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి, సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను. నాకు ఒక అవకాశం ఇవ్వాలని, గౌను గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపిం చాలని కోరుతున్నాను అని అభ్యర్థి తిరుపతిరావు ప్రజలను అభ్యర్థించారు. తిరుపతిరావు చేస్తున్న ప్రచారానికి స్థానిక ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోంది. ఆయన పలకరింపు తీరు, సమస్యలపై ఆయనకున్న అవగాహన, ప్రజలకు మరింత చేరువయ్యేలా చేస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రచారంలో పాల్గొన్న. చింతాడు చిట్టిబాబు. మానే కమల. చింతిరాల సుధీర్. ఉదయ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్న ఊకే పుష్పలత!

## - బిఆర్ఎస్ సిపిఎం జిడిపి కూటమి 15వ వార్డు అభ్యర్థి - గ్యాస్ పొయ్యి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థన - రాజకీయ వారసత్వం ఆమె గెలుపుకు బలం






**భద్రాచలం, (రాజధాని వార్తలు):** స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో భద్రాచలం 15వ వార్డులో బీఆర్ఎస్, సిపిఎం, జిడిపి కూటమి అభ్యర్థి ఊకే పుష్పలత ప్రజల మద్దతుతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. బలమైన రాజకీయ కుటుంబ నేపథ్యం, ప్రజలతో ఉన్న మంచి సంబంధాలు ఆమె గెలుపుకు ప్రధాన బలంగా మారాయి.పుష్పలత కుటుంబానికి రాజకీయాలలో సుదీర్ఘ అనుభవం ఉంది. ముఖ్యంగా, ఆమె అత్త ఊకే శాంతమ్మ గతంలో భద్రాచలం ఎంపీపీ (మండల పరిషత్ అధ్యక్షురాలు) గా ఐదేళ్ల పాటు సమర్థవంతంగా సేవలు అందించారు. శాంతమ్మ ఆ పదవిలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలు ఇప్పుడు వారి వారసురాలికి కలిసి వచ్చే అంశాలు. కుటుంబ రాజకీయ అనుభవం, ప్రజా సేవలో ఉన్న నిబద్ధత కారణంగా ఊకే పుష్పలతకు 15వ వార్డు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఊకె శాంతమ్మ రాజకీయ వారసురాలుగా స్థానికులు ఆమెను తమ ప్రతినిధిగా ఎన్నుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ మా అత్త ఎంపీపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి చాలా అభివృద్ధి చేశారు. ఇప్పుడు వారి ఆశయాలను కొనసాగిస్తూ, 15వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని అన్నారు. వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తానన్నారు. ప్రచారంలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ, సిపిఎం నాయకులు గడ్డం స్వామి, జిడిపి అధినేత గుండు శరత్ వార్డు మెంబర్లు ఆమెతో పాటుగా 15వ వార్డు ప్రచారంలో ఇంటింటికీ తిరుగుతూ, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను వివరిస్తున్నారు. బీఆర్ఎస్, సిపిఎం, జిడిపి కూటమి మద్దతుతో ఊకే పుష్పలత ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలకు గట్టి పోటీదారుగా నిలిచారు.

# విద్యతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు నేర్పేది ఉపాధ్యాయులే

## - కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ మూడులో పాల్గొన్న ఎమ్మెల్యే





**కొత్తవలస, (రాజధాని వార్తలు):** శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలస మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా టీచర్ పేరెంట్స్ మీటింగ్ 3 కార్యక్రమం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సిహెచ్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు మంచి నడవడికతో మెలగాలని అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శతశాతం అక్షరాస్యత రాష్ట్రంగా మార్చాలని దృఢ సంకల్పం పెట్టుకున్నారని ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులు చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాలు యూనిఫాం షూ మిడ్ డే మీల్ వంటి సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వారి జీవితానికి వారే బాటలు వేసుకోవాలని నేడు ఈ పాఠశాల ఆవరణంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చూడముచ్చటగా ఉన్నాయని ప్రతి ఒక్క విద్యార్థి మీ కాళ్ళపై మీరు నిలబడే విధంగా విద్యాభ్యాసాలు చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు అలానే విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు పాఠశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు రత్నాజీ, కొత్తవలస మండల పార్టీ అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ, కొత్తవలస మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కొరుపోలు అప్పారావు, టిడిపి నాయకులు లంక శ్రీను, ఎంపీడీవో రమణయ్య ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూరగాయల పెంపకంపై దృష్టి పెట్టాలి

## - రైతుకు సుస్థిరమైన లాభం వచ్చేలా కృషి చేయాలి
## - ఉద్యానశాఖపై సమీక్షించిన కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల పెంపకాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో సీజనల్ గా డిమాండ్ ఉన్నటువంటి కూరగాయలు, ఆకు కూరలు తదితర పంటల విస్తీర్ణాన్ని పెంచడంపై ఉద్యాన అధికారులు దృష్టి సారించాలని తెలిపారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే మార్గాలను అన్వేషించి రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. కలెక్టర్ చాంబర్లో శుక్రవారం ఉద్యాన శాఖపై సమీక్షించారు. ప్రతి మండ లంలో కనీసం 1000 ఎకరాల్లో ఉద్యాన పంటల అభివృద్ధి జరగాలని సూచించారు. కూరగాయలు సాగు పెంచడానికి నీటి సదుపాయం లేనిచోట రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించి, బోర్వెల్స్ పెట్టించి కూరగాయలు సాగు చేసి తద్వారా కూరగాయల సాగు పెరిగే విధంగా చూడాలని దీనివల్ల రైతులు తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవచ్చని తద్వారా జాతీయ ఆదాయం వృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సమా వేశంలో ఉద్యానశాఖ ఉప సంచాలకులు కె.చిట్టిబాబు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

# ఘంటసాల మన తెలుగు జాతికే గర్వకారణం : బి.ఎ.నారాయణ



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఘంటసాల గానం రసగంగా ప్రవాహమని ఘంటసాల మన తెలుగు జాతికే గర్వకారణం అని ప్రముఖ సంగీత విద్వాంసుడు, సంగీత కళాతపస్వి, సామగాన గంధర్వ బిరుదాంకితులు బి.ఎ.నారాయణ పేర్కొన్నారు. ఘంటసాల జయంతిని పురస్కరించుకొని ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో సీతం కళాశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ తెలుగు పాటకు, భావానికి ప్రాధాన్యత ఇచ్చిన అమర గాయకుడు ఘంటసాల అని అభివర్ణించారు. కార్యక్రమాన్ని డాక్టర్ సన్యాసమ్మ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం గురు ప్రసాద్ మాట్లాడుతూ పద్య పఠనానికి, ఘంటసాల ఒక నూతనత్వాన్ని తీసుకువచ్చి, తెలుగు భాషా సౌందర్యాన్ని ఇనుమడింపజేశారని. ఒక పద్యంలోని భాషను, భావాన్ని చెడపకుండా, రాగ స్వరూపాన్ని పరిపూర్ణంగా విస్తరింపజేసి, తన గాన మాధుర్యంతో ఘంటసాల సంగీత ప్రియులను అలరించారని ,తెలుగు జాతి ఔన్నత్యాన్ని, తెలుగు వారి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఘంటసాలకే చెల్లిందని అన్నారు. ఈ సందర్భంగా బి.ఎ. నారాయణకు సమాఖ్య అధ్యక్షులు పిన్నింటి సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ పూర్వ సభ్యులు కోలగట్ల తమ్మన్న శెట్టి, ప్రముఖ వైద్యులు డాక్టర్ జి సన్యాసమ్మ, సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి లతో కలిసి ఘంటసాల స్మారక పురస్కారాన్ని సముద్రాల గురు ప్రసాద్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఘంటసాల సినీ సంగీత విభావరిలో ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ గాయనీ గాయకులు ఉమామహేశ్వరి, కూర్మారావు, సూర్య ప్రకాష్, నీలిమా రాణి, గిరిజా ప్రసన్న, గణేష్ రెడ్డి తదితరులు తమ పాటలతో ఆద్యంతం అలరించారు. ఈ సమావేశంలో డిమ్స్ రాజు, గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ ఏ.శ్రీనివాసరావు, డివి సత్యనారాయణ, న్యాయవాది నాలుగెస్సుల రాజు, కాగుపాటి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్య, హెూలిస్టిక్ డెవలప్మెంట్ అత్యంత ముఖ్యం

## - విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి ముందుకు సాగాలి - మెగా పేరెంట్, టీచర్ మీట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** గంట్యాడ కేజీబీవీలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ విద్యలో విలువలు, హెూలిస్టిక్ డెవలప్మెంట్ అత్యంత ప్రధానమని పేర్కొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పాఠశాలలు సమర్థంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని బట్టి ఏ-బి-సి-డి గ్రేడులుగా విభజించినపుడు, సి-డి గ్రేడుల్లో ఉన్న విద్యార్థులు కొంతమంది మాత్రమే కొన్ని సబ్జెక్టుల్లో వెనకబడి ఉండవచ్చని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం మరియు పేరెంట్స్ ప్రోత్సాహంతో వారు సులభంగా ఏ-బి గ్రేడ్లకు చేరుకోవచ్చని తెలిపారు. వెనుకబడిన సబ్జెక్టులను గుర్తించి మెరుగుపరుచుకోవడం ద్వారా 100% ఫలితాలు సాధించడం పూర్తిగా సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. 1990లలో ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్ ముందుండడంతో అనేక మంది దేశవిదేశాల్లో స్థిరపడగలిగారని గుర్తు చేస్తూ, విద్యార్థులు కూడా ఉన్నత స్థాయిలకు చేరాలని ఆకాంక్షించారు. ముందుగా కలెక్టర్ విద్యార్థుల స్థితిగతులను వారి వారి తల్లిదండ్రులకు వివరించారు. అదేవిధంగా తరగతి గదులను పరిశీలించి లాబరేటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయుని అవతారం ఎత్తి ఫ్రాక్షన్, రిఫ్రాక్షన్ గురించి కుంభాకార పుటాకార అద్దాల గురించి విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా కొన్ని కెమికల్స్‌ని చూపించి వాటి శాస్త్రీయ నామాలను విద్యార్థుల నుండి రాబట్టారు. సమావేశంలో భాగంగా పాల్గొని విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానం ఇచ్చి వారిలో చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపారు. డీఈఓ మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్, టీచర్ మీట్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు చదువుతున్నారంటే, ఉపాధ్యాయులు బోధిస్తున్నారంటే సరిపోదని, తల్లిదండ్రుల సహకారం విద్యార్థుల అభ్యాసానికి కీలకం అని అన్నారు. విద్యార్థుల లోపాలు గుర్తించడం, వారి భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించడం కోసం ఈ మీట్ ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. విద్యతోనే జీవితంలో మార్పు వస్తుందని, విలువలు పెరుగుతాయని, పిల్లలే మన అసలు ఆస్తి కాబట్టి దేశ సంపదను పెంచేలా వారు రాణించాలని ఆకాంక్షించారు. కేజీబీవీలో అన్ని సౌకర్యాలతో పాటు రక్షణ, పర్యవేక్షణ సమృద్ధిగా ఉన్నాయని, గత ఏడాది సాధించిన 94 శాతం ఫలితాలు ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయని డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి విమల రాణి, స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ డి గౌరీ, కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య సాధ్యం

## - కూటమి పాలన ప్రారంభమైన తర్వాత విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టాం - మరో 30 తరగతి గదులు నిర్మిస్తాం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్





**గజపతినగరం,(రాజధాని వార్తలు):** వినయం, విధేయత, సత్య పూర్వకమైన ఆలోచన మనిషికి అసలైన ఆభరణాలని, అటువంటి సౌశీల్యమైన లక్షణాలతో కూడిన నాణ్యమైన విద్య ప్రభుత్వ బడుల్లో మాత్రమే సాధ్యమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విలువలతో కూడిన చదువు గురించి మాట్లాడే రోజులు వచ్చాయని, ఈ రకమైన చర్చ జరగటం శుభ పరిణామం అన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన ప్రారంభమైన తర్వాత విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ ఫలితంగానే ఈ ఏడాది కాలంలో విద్యాలయాల్లో కొంత మార్పు కనిపిస్తుందని, రాబోయే రోజుల్లో విద్యా వ్యవస్థను సమూలంగా మార్చేందుకు తమ ప్రభుత్వం యువనేత నారా లోకేష్ నాయకత్వంలో శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందనీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రభుత్వ పథకాల ఫలాలు సామాన్యుడికి చేరినప్పుడే అసలైన లక్ష్యం సిద్దిస్తుందని, విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి సామాన్యులలో చర్చించినప్పుడు వారి నుంచి ఇదే రకమైన భావన వ్యక్తం అవుతుందని అన్నారు. పిల్లల ఆలోచన శక్తిని అంచనా వేయగలిగేది తల్లిదండ్రులు మాత్రమేనని, తల్లిదండ్రులు విద్యార్థుల పురోగతిపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చదువే అభివృద్ధికి అసలైన మూలమని, మానవ ప్రగతి విద్య సౌజన్యంతోనే సాధ్యమని అన్నారు. ఈ విద్యాలయాలకు అవసరమైన తరగతి గదులను వివిధ సంస్థల నుంచి వచ్చే సి.ఎస్.ఆర్ ఫండ్స్ ద్వారా నిర్మించాలని నిర్ణయించామని, అందులో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 12 తరగతి గదులు, జూనియర్ కళాశాలకు 6 తరగతి గదులు, డిగ్రీ కళాశాలకు మరో 12 తరగతి గదులను నిర్మించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని, రాబోయే రెండేళ్లలో 30 తరగతి గదులు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లోని ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విద్యార్థులను అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు కంకణబద్ధులు కావడం అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ సమావేశానికి ముందుగా విద్యార్థులకు విద్యా బోధన చేసేందుకు అవసరమైన టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్ ను మంత్రి పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాఠ్య పుస్తకాలు, క్రీడా పరికరాలు, ఆటవస్తులు చిత్రలేఖన ప్రదర్శన, ప్రయోగశాలలో ఏర్పాటుచేసిన పరికరాలను మంత్రి పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశ్నలు సంధించి మంత్రి వారి ప్రావీణ్యతను అంచనా వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి వచ్చిన సమాధానాలతో మంత్రి సంతృప్తిని వ్యక్తం చేసి ప్రభుత్వ విద్యాలయాల నుంచి తమ ప్రభుత్వం ఏమి కోరుకుందో అదే రకమైన మార్పు కనిపిస్తుందని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య, నాటక ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు విలువలతో కూడిన విద్య ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ ప్రదర్శించిన రూపకం అందరిని ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసి ఏ.రామారావు, ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, పిఏసిఎస్ చైర్మన్ బంగారునాయుడు, టీడీపీ మండల అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ప్రకాష్ పట్నాయక్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎంఈఓలు యస్.విమలమ్మ, బి.సాయి చక్రధర్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అధునాతన చికిత్సలో భాగంగా కేర్ హాస్పిటల్స్ ముందడుగు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):**విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ మరియు రోబోటిక్ సర్జన్ డా.బి.బి. దాస్ మాట్లాడుతూ కేవలం 18 నెలల్లో 1,000 రోబోటిక్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు అని చెప్పారు. ఇది కేవలం ఒక సంఖ్య కాదు అని రోగులకు అత్యంత కచ్చితత్వం, ఇంకా ఎక్కువ భద్రత, తక్కువ నొప్పి, మరియు చాలా త్వరగా కోలుకునే అవకాశం కల్పించడంలో కేర్ హాస్పిటల్స్ తీసుకుంటున్న అధునాతన టెక్నాలజీ పురోగతికి ఇది పెద్ద నిదర్శనం అని తెలియచేసారు. గ్యాస్ట్రోఇంటెస్టినల్ అంటే శరీరంలో ఆహారం జీర్ణమయ్యే అవయవాలు (కడుపు, పేగులు, కాలేయం మొదలైనవి). వీటిలో వచ్చే సమస్యలకు శస్త్రచికిత్సలు సాధారణంగా చాలా క్లిష్టమైనవే. అయితే డా విన్సీ రోబోటిక్ సర్జికల్ సిస్టం వంటి అత్యాధునిక రోబోటిక్ సాంకేతికత వినియోగంతో శస్త్రచికిత్స చిన్న కోతలతో, తక్కువ రక్తస్రావంతో, చాలా కచ్చితంగా, సురక్షితంగా చేయడం సాధ్యమవుతోంది అని దీనివల్ల రోగులు తక్కువ నొప్పితో, తక్కువ ఆసుపత్రి కాలంతో, వేగంగా ఇంటికి తిరిగి వెళ్తున్నారు అని అన్నారు.దశాబ్దాల అనుభవం కలిగిన డా.దాస్, చిన్న కోతలతో చేసే మినిమల్ ఇన్వాసివ్ శస్త్రచికిత్సలు మరియు రోబోటిక్ శస్త్రచికిత్సల్లో ముందంజలో ఉన్న నిపుణులు కాగా ఆయన ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ మరియు సమీప ప్రాంతాల రోగులకు క్లిష్టమైన జీర్ణాశయ సంబంధిత సమస్యలకు అత్యంత ఖచ్చితమైన, భద్రమైన చికిత్స అందిస్తున్నారు అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రోబోటిక్ శస్త్రచికిత్స ఎలా రోగుల ఫలితాలను పూర్తిగా మార్చేస్తుందో స్పష్టంగా చూపించారు. 50 ఏళ్ల మహిళకు సూది గుచ్చినంత చిన్న పోర్టుల ద్వారా ఒకేసారి రోబోటిక్ పిత్తాశయం తొలగింపు మరియు హిస్టెరెక్టమీ చేశారు. ఆమె కేవలం 48 గంటల్లో నొప్పి లేకుండా ఇంటికి వెళ్లి సాధారణ జీవితానికి తిరిగి చేరుకుంది అని తెలియచేసారు. పునరావృతమయ్యే పోస్ట్-సర్జరీ హెర్నియాతో బాధపడుతున్న 63 ఏళ్ల రోగికి, లోతైన మెష్ అమరిక మరియు ఖచ్చితమైన కుట్టుతో మచ్చలు లేకుండా రోబోటిక్ మరమ్మత్తు చేశారు. ఆయన అసౌకర్యం లేకుండా పూర్తి ఆరోగ్యానికి చేరుకున్నారు అని అన్నారు. ప్యాంక్రియాటిక్ రాళ్లు మరియు అనియంత్రిత మధుమేహం ఉన్న మరొక రోగికి చిన్న కీహెూల్ పోర్ట్‌లతో సంక్లిష్టమైన రోబోటిక్ ప్యాంక్రియాటోజెజునోస్టమీ చేశారు. ఈ రోగి కదలికలు త్వరగా ప్రారంభించుకుని, ఇన్ఫెక్షన్ రాకుండా, తక్కువ నొప్పితో కోలుకున్నారన్నారు. అత్యవసర పరిస్థితిలో, ప్రాణాంతక ప్లీహ రక్తస్రావంతో ఉన్న 15 ఏళ్ల బాలుడికి రోబోటిక్ పద్ధతిలో స్ప్లెనెక్టమీ చేసి ప్రాణం కాపాడారు. పెద్ద కోత అవసరం లేకుండా, చాలా తక్కువ రక్త నష్టంతో వేగంగా కోలుకున్నారు అని తెలియచేసారు. ఈ సందర్భంగా కేర్ హాస్పిటల్స్, విశాఖపట్నం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జి సుఖేష్ రెడ్డి మాట్లాడుతూ, చాలా తక్కువ సమయంలోనే 1,000 రోబోటిక్ గ్యాస్ట్రో శస్త్రచికిత్సలు చేయడం మా వైద్యుల నైపుణ్యానికి, మా మీద ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి పెద్ద ఉదాహరణ. రోబోటిక్ టెక్నాలజీ వల్ల శస్త్రచికిత్సలు ఇంకా కచ్చితంగా, సురక్షితంగా జరుగుతున్నాయి. దీని వలన రోగులు త్వరగా కోలుకుంటున్నారు. తూర్పు భారతదేశంలోని ప్రజలకు అత్యాధునిక చికిత్సలు అందించడంలో ఇది ఒక కీలక ముందడుగు అన్నారు. అత్యుత్తమ వైద్య నిపుణులతో మరియు ఆధునిక మౌలిక వసతులతో విశాఖపట్నం తూర్పు భారతదేశంలో అడ్వాన్స్‌డ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ కేర్ ప్రధాన కేంద్రంగా ఎదుగుతోంది అని అన్నారు.

# పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపట్టిన వినూత్న పేరెంట్స్ మీటింగ్ : కార్పొరేటర్ రామకృష్ణ



**నెల్లూరు, గజపతినగరం, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని జండా వీధి ఉర్దూ/ఇంగ్లీష్ ప్రాథమిక ఉన్నత పాఠశాల మరియు పాత మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ హాజరై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు విద్యా మరియు ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పిల్లల ఉన్నతి, విద్యా ప్రగతిని దృష్టిలో ఉంచుకుని ఒక వినూత్నమైన Parents Meeting Concept ను రూపొందించిన విషయం ఈ సందర్భంగా కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ పేరెంట్స్ మీటింగ్ ద్వారా పిల్లల విద్యా స్థాయి, ప్రగతి, క్రమశిక్షణ, హాజరు శాతం, భవిష్యత్తు లక్ష్యాలపై ప్రధానంగా చర్చించడం జరిగింది. తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి విద్యా ప్రణాళికలను మరింత మెరుగుపరచడానికి సిద్ధమని తెలిపారు. పిల్లల భవిష్యత్తు నిర్మాణంలో పాఠశాల-తల్లిదండ్రులు కలిసి పనిచేయడం ఎంతో అవసరమని స్కూల్ నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే మున్సిపల్ పరిపాలన మరియు పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మార్గదర్శకత్వంలో నెల్లూరు నగరంలోని ప్రభుత్వ పాఠశాలలను సుందరీకరణ చేసి ప్రపంచ స్థాయి వసతులతో తీర్చిదిద్దుతున్నారని రామకృష్ణ తెలిపారు. ఇప్పటికే విఆర్‌సి స్కూల్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసిన ప్రభుత్వం, వచ్చే సంవత్సరానికి మూలాపేట ఇఎస్‌ఆర్ఎం స్కూల్, మోడల్ హై స్కూల్, స్టోన్స్‌పేట ఆర్ఎస్ఆర్ హై స్కూల్ వంటి పాఠశాలలను ఆధునికీకరించేందుకు కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు వివరించారు. పిల్లలు బాగా చదువుకొని తమ భవిష్యత్తును స్వయంగా నిర్మించుకోవాలని కార్పొరేటర్ రామకృష్ణ ప్రేరణాత్మక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ రెహమాన్, ఐటిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ మహంకాళి సురేంద్ర, సెక్రటరీ దువ్వూరు నరేంద్ర, గిరిధర్, టీ.వెంకటేశ్వర్లు, గిరి, పిల్ల ప్రసాద్, జహూర్ అహ్మద్, తెలుగు మహిళ ప్రెసిడెంట్ చైతన్య, మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ఉమెనహి బేగం, తెలుగు మహిళ వైస్ ప్రెసిడెంట్ సునీత, సుభాని, సలీం, చంద్ర, తెలుగు యూత్ ప్రెసిడెంట్ కిరణ్, జకీర, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ కలహ కర్ణాటకం!

తనను తాను ఓడించుకోవడంలోను, తనకు తాను నష్టం కలిగించుకోవడంలోను పోటీపెడితే స్వర్ణపతకం దక్కేది కాంగ్రెస్ పార్టీకే అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కర్ణాటక కాంగ్రెస్‌లోని 'అంతర్నాటకం' ఇప్పటికే అనేక వారాలుగా మీడియా సాక్షిగా ఎడతెగకుండా ప్రదర్శితమవుతోంది. 'కౌన్ బనేగా ముఖ్యమంత్రి' అనే కాంగ్రెస్ తాజా రాజకీయ నాటకమది. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ పదవిని ఆశిస్తున్న డీకే శివకుమార్ (డీకేఎస్) మధ్య ఇటీవల జరిగిన ఉదయం ఉపాహార సమావేశంలో మెనూతో పాటు ప్రతి చిన్న విశేషాన్నీ మీడియా సవివరంగా నివేదించింది, విశ్లేషించింది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఒకరు, కైవసం చేసుకునేందుకు మరొకరు కలహించుకుంటుండగా, ఎటూ పాలుపోని పార్టీ హై కమాండ్ ఆ ఉభయులనూ సంయమనపరచలేకపోతోంది. గందరగోళం, నియంత్రణ రాహిత్యం పెరిగిపోతోంది. ఈ శోచనీయ పరిస్థితులకు బాధ్యులు ఎవరు? గతించిన మంచి రోజులలో అయితే ఆ ఇరువురికీ కాంగ్రెస్ సముచిత ప్రాధాన్యమివ్వగలిగి ఉండేది. అయితే అటువంటి సానుకూల పరిస్థితులు ఇప్పుడు బొత్తిగా లేవు. భారతదేశ పురాతన రాజకీయపక్షం ఇప్పుడు శక్తిహీనమైపోయింది. అధికార వైభవం గతించిన చరిత్రగా ఉన్నది. పార్టీలో నాయకుల మధ్య ఘర్షణలను సామరస్యపూర్వకంగా పరిష్కరించగల రాజకీయ నైపుణ్యాలు దాదాపుగా నిర్వీర్యమైపోయాయి. నాయకత్వ తగాదాలకు పరిష్కారంగా ముఖ్యమంత్రి పదవిలో, పోటీదారులను ఒకరి తరువాత మరొకరిని నియమించే పద్ధతిని అనుసరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. నిర్మోహమాటంగా చెప్పాలంటే అదొక విడ్డూరమైన ఆలోచన. ఆచరణ యోగ్యం కానిది. కనుకనే అది పనిచేయలేదు. ముఖ్యమంత్రిగా నియమితుడైన నేత రెండున్నర సంవత్సరాల పాటు కొనసాగి, ఆ తరువాత మిగతా రెండున్నర సంవత్సరాలకుగాను ఆ పదవిని తన ప్రత్యర్థి లేదా మరొకరికి అప్పగిస్తాడా? ఈ దేశంలో ఏ నాయకుడూ స్వచ్ఛందంగా సీఎం పదవిని వదులుకోడు, అందునా ఈ కాలంలో. సిద్ధరామయ్య రెండున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న తరువాత, ఆ పదవిలో నియమిస్తామని శివకుమార్‌కు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం నిజంగా హామీ ఇచ్చి ఉంటే, అది, విఫలమైన పద్ధతిని మళ్లీ అనుసరించడమే అవుతుంది. ఉపయుక్తమైన ఆలోచనేనా ఇది? గతంలో రాజస్థాన్‌లోనూ, ఛత్తీస్‌గఢ్‌లోనూ ఈ పద్ధతిని అనుసరించేందుకు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పార్టీలో అంతర్గత కలహాలు పెరిగిపోయాయి. ఫలితంగా ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. మరి కర్ణాటకలో ఇప్పుడు ఆ పద్ధతి ఎందుకు పనిచేస్తుంది? సమస్యేమిటంటే కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ బాగుకు కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ 'హై కమాండ్' సుముఖంగా లేదు. కఠిన నిర్ణయాలు తీసుకోగల తెగువ, సత్తా దానికి లేదని చెప్పడమే సత్యమవుతుంది. 2024 సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్ 'పునరుద్ధరణ' లేదూ, మరింత కచ్చితంగా చెప్పాలంటే బతికి బట్టకట్టిన పరిస్థితి కారణంగా రాహుల్‌గాంధీ నాయకత్వం పట్ల సద్భావం పెరిగింది. ముఖ్యంగా సొంత పార్టీ నేతల నుంచి గౌరవాదరాలను ఆయన తిరుగులేకుండా సముపార్జించుకున్నారు. భారత రాజ్యాంగ ప్రతిని ఎత్తిచూపుతూ జాతి నిర్మాణానికి అది నిర్దేశించిన విధివిధానాలను వివరిస్తూ బీజేపీ మహాశక్తిని ఆయన సమర్థంగా ఎదుర్కొన్నారు. ప్రత్యర్థులు పరిహసించినప్పటికీ కాంగ్రెస్‌లో ఆయన స్థానం మరింత సుదృఢమయింది. సంఘ్ పరివార్‌పై రాజీలేని పోరాటం చేసిన కారణంగా కాంగ్రెస్ శ్రేణులు ఆయన నాయకత్వాన్ని ఎటువంటి ఆక్షేపణలు లేకుండా అంగీకరించాయి. కాంగ్రెస్‌కు తిరుగులేని నాయకుడుగా ఆయన ఆవిర్భవించారు. మరి పార్టీపై మరింత పట్టు సాధించేందుకు ఆయన పూనుకున్నారా? పార్టీ కార్యకలాపాలు అన్నిటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారా? పార్టీ సమస్త వ్యవహారాలనూ స్వయంగా చక్కబెడుతున్నారా? లేదు. అదే సమస్య. పార్టీ సంస్థాగత వ్యవహారాలను చాలావరకు తన విధేయులకు, మరీ ముఖ్యంగా కేసీ వేణుగోపాల్‌కు అప్పగించారు. వేణుగోపాల్ ఇప్పుడు కాంగ్రెస్ 'వ్యవస్థ'లో రెండో అత్యంత శక్తిమంతుడైన వ్యక్తి. మరి పార్టీ కూడా పునశ్శక్తిమంతమయిందా? 2024లో సమకూరిన చెప్పుకోదగ్గ విజయాలు వ్యర్థమయ్యాయి. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ చతికిలపడింది.. మహారాష్ట్రలో మహిళలకు నగదు బదిలీల ద్వారా భారతీయ జనతా పార్టీ జయపతాక ఎగురవేసింది. ఢిల్లీ, బిహార్‌లలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ప్రయత్నాలు ఎల్లప్పుడూ ప్రారంభం కానివే సుమా! పరాజయం తరువాత పరాజయం పాలవుతూ కూడా కఠినమైన, వివేకవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు కాంగ్రెస్ మరింతగా సంకోచిస్తోంది. 'రాజకీయాలలో కొన్నిసార్లు, ఏ నిర్ణయాన్నీ తీసుకోకపోవడమే అత్యుత్తమ నిర్ణయం' అన్న పీవీ నరసింహారావు సుభాషితాన్ని ఔదలదాల్చింది కాబోలు! కాంగ్రెస్ హై కమాండ్‌కు గతంలో ఒక వ్యవస్థగా లేదా ఒక వ్యక్తిగా గుర్తింపు ఉండేది. ఇప్పుడు పరిస్థితి అలా లేదు. కాంగ్రెస్ వ్యవహారాలలో హై కమాండ్ అనే పదానికి కాలం చెల్లిపోయినట్టుగా కనిపిస్తోంది. ఎందుకంటే పార్టీ వ్యవహారాలను సమర్థంగా నిర్దేశించగల 'అత్యున్నత' నేత ఎవరో తెలియదు. నియంత్రించగల వ్యవస్థ ఉనికిలో లేదన్నది స్పష్టం. మరి కాంగ్రెస్ 'హై కమాండ్' ఎవరు? సోనియాగాంధీ ఇంకెంత మాత్రం కాదు. ఆమె ఆ అత్యున్నత బాధ్యతల నుంచి దాదాపుగా వైదొలిగారు, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం కాదు. సహచరులకు సమస్యలు సృష్టించడానికి ఆయన ఇష్టపడరు.

## ఏకగ్రీవంగా ఏపీఎన్జీజీవో ఎన్నికలు - అధ్యక్షులుగా ఎం.పైడన్న




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఏ.పీ ఎన్జీవోల సంఘం గజపతి నగరం తాలూకా యూనిట్ ఎన్నికలు శుక్రవారం స్థానిక ఎన్జీవో హోంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా శుక్రవారం నామినేషన్ ప్రక్రియ నిర్వహించగా, అన్ని పదవులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి జె.విక్టర్, సహాయ ఎన్నికల అధికారి ఏ.ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. నూతన ప్రెసిడెంటుగా ఎం.పైడన్న (మెడికల్), అసోసియేట్ ప్రెసిడెంటుగా కే.స్వామి కుమార్, (మెడికల్) ఎన్నికయ్యారు, ఉపాధ్యక్షులుగా బి.సంతోష్ కుమార్ (పంచాయితీ రాజ్), టి. గోవిందరాజ్ (మెడికల్), పి అశోక్ కుమార్ (జిఎస్డబ్ల్యూఎస్), పి.నందిని (మహిళా ఉపాధ్యక్షురాలు) (ట్రెజరీ) కార్యదర్శిగా ఎం. రమణ (పంచాయతీ రాజ్) ఆర్గనైసింగు కార్యదర్శిగా పీ. త్రినాథ్ వర్మ (పంచాయతీ రాజ్) జాయింటు సెక్రటరీలు గా ఏం హరీష్ (జిఎస్డబ్ల్యూఎస్) పి.పద్మ కుమారి (జిఎస్‌డబ్ల్యూఎస్) ఆర్.సంతోష్ కుమార్ (వ్యవసాయ శాఖ) వై శకుంతలమ్మ (మహిళా) ఐ సి డి ఎస్, కోశాధికారిగా జె.వి అప్పలరాజు (కోశాధికారి) ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జి సత్యవతి, బి సుగుణమ్మ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎం. శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో, ముఖ్యంగా హాజరైన మహిళా ఉద్యోగులు తో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో విజయనగరము జిల్లా ఏపీఎన్జిజిఓ అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, కార్యదర్శి ఏ.సురేష్, పార్వతీపురము మన్యం జిల్లా అడ్ హాక్ కమిటీ చైర్మన్ జీ.వి.ఆర్.ఎస్. కిషోర్, పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో ఒకని మృతి

### - ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గంట్యాడ మండలం బుడతనాపల్లి గ్రామానికి చెందిన కొర్నాన అప్పలనాయుడు(30) అనే వ్యక్తి మండలంలోని పురిటి పెంట సమీపంలో ఇసుకలోడు చేసిన అనంతరం ట్రాక్టర్ పైకి ఎక్కి ఇసుక చదును చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై కె కిరణ్ కుమార్ నాయుడు శుక్రవారం తెలిపారు. తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## కార్మికుల సంక్షేమం.. అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన అజెండా

### - రూ.70 కోట్లతో వారి కుటుంబ సభ్యులకు, పిల్లలకు నైపుణ్య శిక్షణ అందిస్తాం
### - గతంలో నిలిచిపోయిన పథకాలను కొనసాగిస్తాం : మంత్రి వాసంశెట్టి సుభాష్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, అభ్యున్నతే ప్రధాన అజెండాగా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని, దానిలో భాగంగానే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని, గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన కార్మిక సంబంధిత పథకాలను తిరిగి కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. వారికి అన్ని విధాలుగా న్యాయం జరిగేలా, కష్టాలను తీర్చేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని గుర్తు చేశారు. కార్మికుల కుటుంబ సభ్యులకు, పిల్లలకు మెరుగైన ఉపాధి నిమిత్తం నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటోందని, దీనికి కోసం రూ. 70 కోట్లు వెచ్చించనుందని వివరించారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా పలు భవన నిర్మాణ ప్రాంతాలను పరిశీలించిన అనంతరం స్థానిక మేఘాలయా హోటల్లో జరిగిన కోనసీమ, ఉత్తరాంధ్ర భవన నిర్మాణ కార్మికుల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ క్రమంలో ముందుగా వివిధ అంశాలపై మీడియాతో మాట్లాడారు. కార్మికుల పనిదినాలు పెంచేలా, ఆదాయం రెట్టింపు అయ్యేలా చర్యలు తీసుకుంటామని, ప్రత్యేకంగా లేబర్ అడ్డాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆధునిక పరికరాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణలు అందిస్తామని, జీవన ప్రమాణాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పనిదినాలు పెరిగేలా, ఉపాధి మెరుగు పడేలా జీఎస్టీ రేట్లను కూడా తగ్గించామని మంత్రి గుర్తు చేశారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేలా, చదువును ప్రోత్సహించేలా ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికీ తల్లికి వందనం వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్య సంస్థలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. విశాఖలో సుమారు రూ. 106 కోట్ల వరకు సెస్ రావాల్సి ఉండగా, రూ. 20 కోట్ల వరకు మాత్రమే వసూలయ్యిందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా రాష్ట్రంలో నిబంధనలు పాటించని సంస్థలపై ఇప్పటి వరకు 160 కేసులు పెట్టామని వివరించారు.

**ప్రమాద భీమా, మట్టి ఖర్చులు వచ్చేలా చర్యలు : ఛైర్మన్ బాజ్జీ**

కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద భీమా వర్తించేలా, మట్టి ఖర్చులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ వలవాల మల్లికార్జున రావు (బాజ్జీ) పేర్కొన్నారు. సాధారణ సమయంలో చనిపోయిన కార్మికులకు ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సాయం అందించాలని కార్మిక సంఘాల నుంచి ప్రతిపాదన ఉందని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణలో రూ. 1 లక్ష ఇస్తున్నారని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్మికులకు ఏటా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేలా, కార్మిక సంఘాల నుంచి వచ్చిన వినతులకు, విజ్ఞాపనలకు తగిన పరిష్కార మార్గాలు కనుగొంటామని పేర్కొన్నారు. ఆధునిక పరికరాల వినియోగం, నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, కార్మికుల అన్ని విధాలుగా న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

## యాత కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలి

### - యాత కులానికి అట్రాసిటీ యాక్ట్ వర్తింప చేయాలి : రాజు గౌడ్ యాత

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఆరు లక్షల పైచిలుకు జనాభా గల యాతలు ముఖ్యంగా విశాఖ జీవీఎంసీ పరిధిలో రెండు లక్షల పైచిలుకు జనాభా ఉంది. కల్లుగీత పై ఆధారపడి బ్రతుకుతూ జీవనం సాగిస్తున్న ఈ కులం అత్యంత వెనుకబడిన కులం 2014 చంద్రబాబు పరిపాలనలో యాతకులానికి అట్రాసిటీ యాక్ట్‌ని కూడా వర్తింపజేశారు. వైసీపీ ప్రభుత్వంలో యాత కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న యాతా కార్పొరేషన్ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు. వినవంటేనే యాత్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని రాజు గౌడ్ యాత విజ్ఞప్తి చేశారు. యాతకులం రాజకీయంగా అత్యంత వెనుకబడిన కులం రాష్ట్రంలో ఒక ఎంపీటీసీ కూడా లేని కులం. కావున ప్రభుత్వం వారు యాతకులాన్ని ఆదుకోవాలని యాతకులం వారికి ఒక ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం జరుగుతుంది. యాతకులాన్ని రాజకీయంగా అభివృద్ధి చేయాలని అదేవిధంగా ఆర్థికంగా అభివృద్ధి చేయాలని యాతకులానికి అట్రాసిటీ యాక్ట్‌ను వర్తింప చేయాలని ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించడం జరుగుతుంది. కార్యక్రమంలో యాత నాయకులు వాసు, రాజు, సంపత్, శరన్, రమణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులను ప్రోత్సహించుదాం

### - ప్రపంచానికి ఆహారం అందించే రైతుకు చేయూత ఇవ్వాలి - చిరంజీవి చౌదరి, సెక్రటరీ, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులను ప్రోత్సహించుదాం అని ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం సెక్రటరీ చిరంజీవి చౌదరి అన్నారు. శుక్రవారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రకృతి పంటల మేళాను చిరంజీవి చౌదరి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ జల వనరుల విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ సందర్శించారు. ప్రతి స్టాల్‌కి వెళ్లి అక్కడ ఉన్న ప్రకృతి ఆధారంగా పండిన పంటలు, ఆ పంటలతో తయారు అయిన ఉత్పత్తులు గురించి అడిగి తెలుసుకున్నారు. సిద్ధ వైద్యులకు సాయిప్రసాద్ శాలువా కప్పి సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో చిరంజీవి చౌదరి మాట్లాడారు. ప్రపంచానికి ఆహారం అందించే రైతుకు చేయూత ఇవ్వాలని కోరారు. ప్రకృతి పంటల మేళాను ఆదరిస్తున్న ప్రజలందరికీ అభినందనలు తెలియజేశారు. రాష్ట్రం అంతటా సిద్ధ వైద్యానికి సహకారం అందిస్తున్న వారు అందరికీ ఆయన సాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ గ్రూప్‌లు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ, అగ్రి డిఎన్‌ఎ వెంచర్స్ సంస్థల నేతృత్వంలో ఈ మేళా జరుగుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికారత సంస్థ ఉత్తరాంధ్ర ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ బాబూరావు నాయుడు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి పాలెం అశోక్, ప్రకృతి రైతులు పిఎల్‌ఎన్ రాజు, ఎన్ నరేంద్ర, రిషి, అవని ఆర్గానిక్స్ ఉషా గజపతి రాజు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రకృతి రైతులు, సిద్ధ వైద్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బోదువలస ప్రభుత్వ పాఠశాలలో 'మెగా పీటీఎం 3.0'

### - సేంద్రియ వ్యవసాయంపై చైతన్య కార్యక్రమం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** బోదువలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉదయం 'మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ (పీటీఎం) 3.0' ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వారం రోజుల ముందుగానే ఆహ్వాన పత్రాలు, కరపత్రాలు పంపిణీ చేయడం ద్వారా పాఠశాల అంతట పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం 9 గంటలకు ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, దాతలు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొని పాఠశాల అభివృద్ధికి తమ కృతజ్ఞత వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు అనిత స్వాగత ప్రసంగం అనంతరం పాఠశాల పురోగతిపై సమగ్ర వివరణ ఇచ్చారు. విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించే సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించగా, హోలిస్టిక్ రిపోర్ట్ కార్డులను విద్యార్థులకు అందజేశారు.

**సేంద్రియ వ్యవసాయంపై చైతన్య కార్యక్రమం**

కార్యక్రమంలో భాగంగా సేంద్రియ వ్యవసాయంపై చైతన్యం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో కలిసి వంకాయ, బెండకాయ, టమాటా, పచ్చిమిర్చి, కాకరకాయ, ఉల్లి, కాప్సికం, కేబేజీ, క్యారట్, ఆకుకూరల విత్తనాలను స్కూల్ ఆవరణలో నాటారు. సేంద్రియ ఎరువులతో పెంచిన ఆరోగ్యకర కూరగాయలు తినే అలవాటును అలవరచుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి విత్తనాలు కూడా పంపిణీ చేశారు.

**దాతల సహకారం కోరిన టీచరు**


పిల్లల ఆడుబడి విస్తరణకు దాతలను ముందుకు రావాలంటూ పిలుపునిచ్చారు. పిల్లల మానసిక వికాసానికి ఊయలలు, జారుడు బల్లలు, నిచ్చెనలు అవసరమని ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంలో అనిత టీచర్ స్వయంగా ఒక ఆట వస్తువును స్పాన్సర్ చేయనున్నట్లు ప్రకటించారు. సత్కారాలు ఆత్మీయ విందు కార్యక్రమం ముగింపులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వలయాకారంగా కూర్చుని షడ్రుచులతో డొక్కా సీతమ్మ అందించిన భోజనంను ఆస్వాదించారు. అనంతరం తల్లులకు ఆటల పోటీలు నిర్వహించి, చీరలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రేమలో చీటింగ్ తల్లి ప్రసవ వేదనతో సమానం!




యువతీ, యువకులు ప్రేమలో పడి మోసపోతున్న వైనం తెలిసిందే. ప్రేమ అనే మత్తులో జీవితాన్నే కోల్పోతున్నారు. కన్నవారిని వదిలేసి ఒంటరిగా జీవిస్తున్నారు. మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజమైన ప్రేమలో ఇవన్నీ ఉత్పన్నమవుతోన్న ప్రధాన కారణాలుగా ఓ సర్వేలో కూడా తేలింది. తాజాగా సీనియర్ నటి, హెూస్ట్ ఇంద్రజ లవ్, బ్రేకప్ గురించి ఓ టాక్ షోలో స్పందించారు. కొంత మంది యువతీ, యువకులు ప్రేమ, బ్రేకప్‌ను చాలా సులభంగా తీసుకుంటున్నారు. ఇలాంటి వాటిపై మీ అభిప్రాయం ఏంటి అని ప్రశ్నించంగా బిడ్డకు జన్మనిచ్చేటప్పుడు కలిగే ప్రసవ వేదన (బాధ) ఎంత తీవ్రంగా ఉంటుందో ప్రేమలో మోసపోతే కలిగే బాధ కూడా అంతే స్థాయిలో ఉంటుందన్నారు. మోసానికి ఇక్కడ జెండర్‌తో సంబంధం లేదు. ఆడ అయినా కావొచ్చు! మగ అయినా కావొచ్చు! ఎవరిదైనా మనసే. ఆ మనసును గాయపరచడం అత్యంత పాపం. ఆ పెయిన్ భరించిన వాళ్లకి మాత్రమే తెలుస్తుంది. అలా మోసం చేసి వెళ్లిపోయిన వారికి పుట్ట గతులుండవు. పుట్టింది ప్రేమించడానికి కాదు..సాధించడానికి యువత ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రేమ అనేది జీవిత ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అన్నారు. ఇంద్రజ కూడా ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఈమెది మతాంతర వివాహం. ఇంద్రజ హిందు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అమ్మాయి. ఆమె భర్త ఒక ముస్లిం. పెళ్లికి ముందు ఆరు సంవత్సరాల పాటు స్నేహితులుగా కొనసాగారు. ఆ తర్వాతే వీరి మధ్య ప్రేమ చిగురించింది. అభిప్రాయాలు పంచుకున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. ఆ తర్వాతే వివాహ బంధంతో ఒకటయ్యారు. మీ పెళ్లికి మతం అడ్డు రాలేదా? అన్న ప్రశ్నకు గొప్ప సమాధానం ఇచ్చారు అప్పట్లో. ఇష్టం అనేది మతం, కులం చూసి కలగదు కదా..? మతానికి, మనసుకు నచ్చడానికి సంబంధం లేదు అన్నారు. తను నాకు అండగా ఉంటాడని నమ్మాను, ఆయన కూడా అంతే.. అందుకే పెళ్లి చేసుకున్నాం అన్నారు. ఇప్పుడా దంపతులకు ఓ పాప..బాబు కలరు. ప్రస్తుతం ఇంద్రజ కెరీర్‌లో సెకెండ్ ఇన్నింగ్స్ కొనసాగిస్తున్నారు. టెలివిజన్ కార్యక్రమాల్లో హెూస్ట్‌గా పని చేస్తున్నారు. ఈవెంట్‌లో ఎంతో హుందాగా వ్యవహరించడం ఇంద్రజ ప్రత్యేకం. ఎన్ని కామెడీ షోలు చేసినా ఇంద్రజ మాత్రం ఏనాడు హద్దు మీరడం గానీ...డబుల్ మీనింగ్ డైలాగ్‌లు వంటి వాటి జోలికి వెళ్లలేదు. అలాగే సినిమాల్లో నటిగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఏ భాషలో ఛాన్సులొచ్చినా పని చేస్తున్నారు.

# జాన్వీకి పెరుగుతున్న మద్దతు.. ఇప్పటికైనా మార్పు వస్తుందా?



డిజిటల్ యుగంలో కూడా లింగ సమానత్వం కోసం పోరాడాల్సి వస్తోంది అంటూ కొంతమంది నటీమణులు చేస్తున్న కామెంట్లు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సాధారణంగా ఒకప్పుడు మహిళలు అంటే వంట గదికే పరిమితమయ్యేవారు. కానీ కాలం మారుతున్న నేపథ్యంలో మహిళలు ప్రతి రంగాలలో ముందుంటున్నారు. అంతేకాదు అంతరిక్షానికి కూడా వెళ్లి తమ సత్తా ఏంటో నిరూపిస్తున్నారు. ఇక ఒక్కటేమిటి పురుషుడితో సమానంగా పోటీపడుతూ దూసుకుపోతున్న ఈ డిజిటల్ యుగంలో కూడా మహిళలకు సరైన గౌరవం లభించడం లేదు అని, పురుష అహంకారం ఎక్కువవుతోంది అంటూ జాన్వీ కపూర్ కామెంట్లు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా సమానత్వం కోసం ఇప్పుడు పోరాడగలిగితేనే వచ్చే జనరేషన్‌కైనా ఈ ఇబ్బందులు ఉండవు అని ఆమె తన అభిప్రాయంగా చెప్పుకొచ్చింది. అయితే ఇప్పుడు ఆమె అభిప్రాయానికి అండగా నిలిచారు గ్లోబల్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా. లింగ సమానత్వం కోసం మాత్రమే కాదు ఇలా పోరాడే వారికి కూడా మద్దతుగా నిలవాలి అంటూ చెప్పుకొచ్చింది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం. బాలీవుడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న జాన్వీ కపూర్ శ్రీదేవి, బోనీకపూర్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఒకవైపు నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఈమె.. మరొకవైపు సినీ ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న విషయాలపై కూడా స్పందిస్తోంది. విషయంలోకి వెళ్తే.. తాజాగా ముంబై వేదికగా జరిగిన “వీ ది విమెన్ ఆసియా” కార్యక్రమంలో జాన్వీ మాట్లాడుతూ.. “మహిళగా పుట్టడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. సమానత్వం అనేది మాటలతో, చర్చల తోనే ప్రారంభమవుతుంది. మనం ఈ అంశం గురించి ఇప్పటికైనా ఓపెన్‌గా మాట్లాడితేనే మన తర్వాత తరానికైనా దీనిపై పూర్తి అవగాహన వస్తుంది. నేను మహిళగా పుట్టినందుకు గర్వపడుతున్నాను. మనల్ని మనం ప్రశంసించుకుంటూ ముందుకు సాగాలి. మహిళలు శక్తిమంతులు. వారిని ప్రోత్సహిస్తే.. అద్భుతాలు సృష్టిస్తారు” అంటూ జాన్వీ కపూర్ తెలిపింది. జాన్వీ కపూర్ మాట్లాడిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ వీడియోని తన ఇన్‌స్టాగ్రామ్ స్టేటస్ ద్వారా షేర్ చేస్తూ “ఇలా మాట్లాడే వారిని కూడా ప్రోత్సహించాలి” అంటూ గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కామెంట్ చేసింది. జాన్వీ కపూర్ మాటలకు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మద్దతుగా నిలవడంతో అందరూ ప్రశంశలు కురిపిస్తున్నారు. అంతేకాదు ఇప్పటికైనా ఇండస్ట్రీలో మార్పు రావాలి అని కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే గతంలో ట్వింకిల్ ఖన్నా, కాజోల్ కలసి నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న జాన్వీ కపూర్ మాట్లాడుతూ..” ఇండస్ట్రీలో కొనసాగాలి అంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. ముఖ్యంగా నలుగురు మహిళలు ఉన్నచోట నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను. కానీ అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నా అభిప్రాయాన్ని వ్యక్తపరచలేదు. దీనికి చాలా నేర్పు ఉండాలి. ఒక స్టార్ కిడ్‌కి అలాంటి సమస్యలు ఏమి ఉండవు అనుకుంటారు. కానీ నేను కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఎన్నో పోరాటాలు చేశాను” అని కూడా జాన్వి కపూర్ తెలిపింది. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి.


# అమితాబ్ గురించి కంటే ఊర్మిళ గురించే ఎక్కువ....!






విలక్షణ దర్శకుడు అంటూ కెరీర్ ఆరంభంలో పేరు సొంతం చేసుకున్న రామ్‌గోపాల్ వర్మ, కాల క్రమేనా వివాదాల దర్శకుడిగా పేరు పడ్డాడు. ఆయన మాట్లాడితే వివాదం, మాట్లాడాలి అంటే వివాదం ఉండాల్సిందే. అలాంటి వర్మ గురించి గత మూడు దశాబ్దాలుగా ఏవో పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన గురించి ప్రముఖంగా వినిపించే పుకారు ఒకటి ఉంది. అదే వర్మకు హీరోయిన్ ఊర్మిళ మంటోడ్కర్ అంటే ప్రేమ, ఆ ప్రేమ కారణంగానే ఆమెతో వరుస సినిమాలు చేశాడు. ఇద్దరి మధ్య ఒకానొక సమయంలో ప్రేమ వ్యవహారం సాగింది అనేది ఇప్పటికీ చాలా మంది అంటూ ఉంటారు. ఇప్పుడు ఎవరి జీవితాలతో వారు బిజీగా ఉండటంతో ఆ పుకార్లు రావడం లేదు, కానీ ఒకప్పుడు ఇద్దరి మధ్య ప్రేమ అనేది ఉంది అని మాత్రం ఇప్పటికీ చాలా మంది ఇండస్ట్రీ వర్గాల వారు, మీడియా సర్కిల్స్ వారు మాట్లాడుతూనే ఉంటారు. హీరోయిన్ ఊర్మిళతో ప్రేమాయణం... హీరోయిన్ ఊర్మిళతో తనకు ఉన్న రిలేషన్, ఆమెతో ఉండే బాండింగ్ గురించి మీడియాలో వచ్చే పుకార్లపై దర్శకుడు వర్మ గతంలో పెద్దగా స్పందించలేదు. ఒకవేళ ఆ ప్రశ్న వచ్చినా కూడా అనుకుంటే అనుకున్నారు అన్నట్లుగా లైట్ తీసుకున్నాడు. కానీ ఇప్పుడు వర్మ ఆ విషయాన్ని కాస్త సీరియస్‌గానే ఖండించాడు. రామ్ గోపాల్ వర్మ సాధారణంగా పుకార్లు వస్తే పెద్దగా పట్టించుకోడు అనే విషయం తెల్సిందే. అందుకే ఇన్నాళ్లు అయినా ఆ పుకార్ల గురించి పెద్దగా స్పందించకుండా ఉన్నాడు. ఇప్పుడు ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇప్పటికి అయినా ఆ విషయం గురించి ఒక ఫుల్ స్టాప్ పెట్టాలి అనే ఉద్దేశంతో క్లారిటీ ఇచ్చినట్లుగా మాట్లాడాడు. ఈ సమయంలో ఆయన తన చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు అన్నట్లుగా కొన్ని ఉదాహరణలు కూడా చెప్పడంతో ఇకపై అలాంటి పుకార్లు రాకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఊర్మిళ గురించి వర్మ మాట్లాడుతూ... ఆమె మల్టీ ట్యాలెంటెడ్ నటి, ఆమెతో వర్క్ చేయడం చాలా కంఫర్ట్‌గా అనిపిస్తుంది. ఆమెతో ఎక్కువ సినిమాలు చేయడంకు కారణం ఆమె ప్రతిభ మాత్రమే. అంతకు మించి ఏమీ లేదు. ఎక్కువ సినిమాలు చేసినంత మాత్రాన ఏదో అన్నట్టు కొందరు అనుకుంటూ ఉంటారు. అయితే ఊర్మిళతో కంటే నేను ఎక్కువగా అమితాబ్ బచ్చన్‌తో సినిమాలు చేసినట్లు చెప్పుకొచ్చాడు. కానీ చాలా మంది ఊర్మిళతో నేను చేసిన సినిమాల గురించే ఎక్కువగా మాట్లాడుతున్నారు అని వర్మ అన్నాడు. ఎదుటి వ్యక్తి ప్రతిభావంతులు అయినప్పుడు ఎక్కువ సినిమాలు చేయాలని అనుకుంటాం. వారితో కంఫర్ట్ ఉన్నప్పుడు ఎక్కువ సినిమాలకు వర్క్ చేయాలని అనుకుంటాం. ఆమె ప్రతిభావంతురాలు కావున ఆమెతో సినిమాలు ఎక్కువ చేయడం జరిగిందని ఈ సందర్భంగా వర్మ చెప్పుకొచ్చాడు. వర్మ, ఊర్మిళ కాంబినేషన్‌లో రంగీలా, దౌడ్, సత్య మొదలగు సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. అంతే కాకుండా వీరిద్దరూ ఆ సమయంలో ఎక్కువగా సన్నిహిత్యంగా ఉంటూ కనిపించే వారని అంటారు. అందుకే వీరి గురించి పుకార్లు ప్రముఖంగా రావడం మనం చూస్తూ వచ్చాం. కానీ వర్మ మాత్రం ఆమె ప్రతిభావంతురాలు కావడం వల్లే ఎక్కువ సినిమాలు ఆమెతో చేసినట్లు చెప్పుకొచ్చాడు. ఇకపై అయినా ఈ పుకార్లకు చెక్ పడుతుందేమో చూడాలి. వర్మ ఈ మధ్య కాలంలో సినిమాల పరంగా కాస్త స్లో అయ్యాడు. ఆ మధ్య రాజకీయ పరమైన వ్యాఖ్యల కారణంగా వార్తల్లో నిలవడంతో పాటు వివాదాల్లో నిలిచిన విషయం తెల్సిందే. ఇప్పుడు మాత్రం రాజకీయాలకు దూరంగా ఉంటున్నాడు. ఇటీవల ఆయన మొదటి సినిమా శివ రీ రిలీజ్ సందర్భంగా పలు ఇంటర్వ్యూలు ఇచ్చాడు. ఇప్పుడు పోలీస్ స్టేషన్ మే భూత్ అనే సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# తొలిసారి ట్రెడిషనల్ లుక్ లో అనన్య.. చూపులకే దాసోహం!



ప్రస్తుత కాలంలో చాలామంది హీరోయిన్స్ తమ ఉనికిని చాటుకోవడానికి సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు. అందులో కొంతమంది గ్లామర్‌తో ఆకట్టుకుంటే.. మరి కొంత మంది ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి అబ్బురపరుస్తూ ఉంటారు. ఇంకొంతమంది గ్లామర్‌తోనే హీట్ పెంచి సడన్‌గా ట్రెడిషనల్ లుక్‌లో కనిపించేసరికి అభిమానులు సైతం వారి అందానికి ముగ్ధులు అవుతున్నారు. అలాంటి వారిలో అనన్య పాండే కూడా ఒకరు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులలో హీట్ పుట్టించే ఈ ముద్దుగుమ్మ.. తాజాగా ట్రెడిషనల్ లుక్‌లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది.ఆరెంజ్ కలర్ సిల్క్ శారీ ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్‌లో ఆరెంజ్ కలర్ బ్లౌజ్ ధరించి తన అందంతో ఆకట్టుకుంది. కొంటెగా ఫోటోలకు ఫోజులిస్తూ.. చూసే అభిమానుల హృదయాలు దోచుకుంది. ముఖ్యంగా అనన్య పాండేని ఇంత ట్రెడిషనల్ గా ఎప్పుడూ చూడలేదని కొంతమంది అభిమానులు కామెంట్లు చేస్తుంటే.. మరి కొంతమంది చక్కగా బుట్ట బొమ్మలా ఉంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా చాలా రోజుల తర్వాత ట్రెడిషనల్ లుక్‌లో అందులోనూ చీరకట్టులో కనిపించి అందరిని మెస్మరైజ్ చేస్తోంది అనన్య పాండే. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పేరు చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. అనన్య పాండే కెరియర్ విషయానికి వస్తే.. ప్రముఖ నటిగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. హిందీ, తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరిస్తోంది. ముఖ్యంగా ఈమె ఎవరో కాదు ప్రముఖ హిందీ సినిమా నటుడు చుంకీ పాండే కూతురు. ఈమె తాత ఎవరో కాదు ప్రముఖ హార్ట్ సర్జన్ శరద్ పాండే. 2019లో వచ్చిన స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 చిత్రం ద్వారా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈమె మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. పునీత్ మల్హోత్రా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో టైగర్ ష్రాఫ్, తారా సుతారియా, అనన్య పాండే, ఆదిత్య సీల్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా తర్వాత పతీ పత్నీ ఔర్ ఓ సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇకపోతే 2022లో ప్రముఖ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రౌడీ హీరో విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన లైగర్ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. భారీ అంచనాల మధ్య పాన్ ఇండియా రేంజ్ లో విడుదలైన ఈ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో ఈ అమ్మడికి మళ్లీ తెలుగులో అవకాశాలు లభించలేదు. ప్రస్తుతం హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. అనన్య పాండే సోదరుడు అహాన్ పాండే సయారా సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి మొదటి సినిమాతోనే అత్యధిక ప్రజాదారణ పొందిన నటుడిగా పేరు దక్కించుకున్నారు.

# గ్రామీణ రైతులకు సువర్ణావకాశం - మళ్లీ ప్రారంభమైన సాదాబైనామా రిజిస్ట్రేషన్లు



**డక్కిలి, (రాజధాని వార్తలు):** సాదాబైనామా రిజిస్ట్రేషన్ ప్రక్రియ మళ్లీ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సన్న, చిన్నకారు రైతులకు ఇది నిజమైన సువర్ణావకాశం అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికే సాదాబైనామాలతో జరిగిన భూముల లావాదేవీలపై పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మరోసారి అవకాశం కల్పించినట్టు వివరించారు. 2024 జూన్ 15 లోపల జరిగిన సాదాబైనామా లావాదేవీలను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని, రిజిస్ట్రేషన్ సందర్భంలో రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, దరఖాస్తుతో పాటు ఫారం-10 తప్పనిసరిగా జత చేయాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి రిజిస్ట్రేషన్ అనుమతులు జారీ చేయనున్నట్టు వెల్లడించారు. దరఖాస్తు చేసిన తర్వాత 90 రోజుల్లోనే పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రతి అర్హత కలిగిన రైతు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# 52వ డివిజన్‌లో విజయవంతంగా పూర్తి చేసిన కోటి సంతకాల సేకరణ

## - పూర్తి చేసిన 5000 కాపీలను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేసిన డివిజన్ ఇన్‌చార్జ్ మహబూబ్ బాషా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులో వైఎస్ఆర్సిపి సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిలిని వైసీపీ 52వ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ మహబూబ్ బాషా డివిజన్ నేతలతో కలిసి కోటి సంతకాల సేకరణలో పూర్తి చేసిన 5000 కాపీలను పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. డివిజన్‌లో ప్రజలు అందిస్తున్న మద్దతుతో రెట్టింపు ఉత్సాహంతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామని వారు చంద్రశేఖర్ రెడ్డికి తెలిపారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన పలువురు డివిజన్ నేతలను చంద్రశేఖర్ రెడ్డి అభినందించారు.

# "నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలి": కాకాణి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, ముత్తుకూరు మండలం, పోలంరాజుగుంట, దమ్మాయిపాళెం గ్రామాలలో దిత్వా తుఫాను ప్రభావిత ప్రాంతాలలో రైతులు, ప్రజలతో కలిసి పర్యటించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. వర్షాల కారణంగా నారుమళ్లు దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడింది.

మొంథా తుఫానులో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో 18 నెలల కాలంలో సోమిరెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం. సోమిరెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ, ప్రజలు, రైతుల సంక్షేమం గురించి ఆలోచన చేయడం లేదు.. సోమిరెడ్డి థర్మల్ విద్యుత్ కేంద్రాల నుండి బూడిద తరలించే బంకర్ల నుండి 300/- రూపాయలు దారి దోపిడి చేస్తూ, పామాయిల్ అసోసి యేషన్ పేరిట వసూళ్లకు పాల్పడుతూ, ఎక్కడపడితే అక్కడ గ్రావెల్ త్రవ్వకొని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో వరదల వల్ల నష్టపోయిన రైతులకు సబ్సిడీ విత్తనాలతో పాటు, అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాం. రైతులకు జరిగిన నష్టంపై అంచనాలు తయారు చేసి, వెంటనే నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులతో కలిసి పోరాటం చేస్తుంది.



# ఆనం అరుణమ్మని పరామర్శించిన మాగుంట

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాతృమూర్తి కోడూరు సరస్వతమ్మ ఇటీవల మృతి చెందడంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గం చింతరెడ్డిపాళెంలోని నివాసానికి వెళ్లి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి పరామర్శించడం జరిగింది.

# రౌడీలు, గంజాయి బ్యాచ్‌లు, భూ కబ్జాదారులు అన్ని రకాల అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపండి

## - నెల్లూరు రూరల్ సిఐలను ప్రత్యేకంగా కోరిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల సిఐలతో ప్రత్యే కంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గత 18 నెలలుగా నేను కానీ, మా పార్టీ నాయకులు కానీ పోలీసుల విధుల్లో ఎలాంటి జోక్యం చేసుకోలేదని, అసాంఘిక కార్యకలా పాలని ఉక్కుపాదంతో అణచివేయాలని కోరానని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే మాటకు కట్టుబడి ఉన్నానని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా నేను కానీ, మా పార్టీ నాయకులు ఎవ్వరూ కూడా పోలీసుల విధి నిర్వహణలో జోక్యం చేసుకోమని, ఎవరైనా జోక్యం చేసుకుంటే మీరు వినాల్సిన అవసరం లేదని పోలీస్ అధికారులకు తెల్చి చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం పోలీస్ అధికారులకి అన్నిరకాలుగా నైతికంగా అండగా నిలుస్తుందని, పోలీస్ అధికారులు కూడా అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపాలని కోరారు.

# తల్లికి వందనం ఒక చరిత్ర

## - రాజకీయాలకు తావు లేకుండా స్కూళ్ల అభివృద్ధి - గత ప్రభుత్వంలో గాడి తప్పిన విద్యా వ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసిన ఘనత యువ నేత, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్‌దే





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్ జడ్పీ హై స్కూల్ (బాయ్స్)లో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఇంతటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, యువనేత, రాష్ట్ర విద్యా శాఖా మంత్రివర్యులు నారా లోకేష్‌కి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో చదువుతున్న ఎందరు పిల్లలుంటే అందరు పిల్లలకు తల్లికి వందనం నేరుగా తల్లి అకౌంట్‌కే నగదు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు రాష్ట్ర విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్‌దే. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. గత ప్రభుత్వంలో నాలుగైదు క్లాసులకు ఒకే ఉపాధ్యాయుడుంటే విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ క్లాస్‌కు ఒక టీచర్ విధానం ప్రవేశ పెట్టారు. కావున విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని, చదువులో రాణించి, జన్మనిచ్చిన తల్లి తండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.

# ఘనంగా వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్ టీచర్స్ మీటింగ్










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కాంతారావు గ్రామ పెద్దలు సుందరయ్య చిన్న వెంకటేశ్వర్లు విఆర్ఓ అంకయ్య ఇన్చార్జి హెచ్ఎం బోయి దాస్ ఉపాధ్యాయులు పద్మా రత్నం శ్రీనివాసులు శ్రీధర్ ప్రభావతి మృదుల శైలజ సరస్వతి మరియు విద్యార్థిని విద్యార్థులు వారు తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది. సమావేశంలో బాల్యవివాహాల నిర్మూలనపై అందరి చేత ప్రతిజ్ఞ చేయించడం తల్లిదండ్రులు పిల్లలు కలిసి చక్కగా భోం చేయడం జరిగింది ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ కాంతారావు ఇంగ్లీషు అసిస్టెంట్ బోయి దాస్ మాట్లాడుతూ 10వ తరగతికి సంబంధించి వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను చక్కగా అమలు పరుస్తూ ఇటు టీచర్లు అటు తల్లిదండ్రులు బాధ్యులుగా ఉండి మంచి మార్కులతో వారు పాస్ అయ్యే విధంగా మనందరం కలిసి స్కూలుకు ఊరికి మంచి పేరును తీసుకు రావాలని చెప్పడం జరిగింది. తల్లిదండ్రులు విద్యార్థుల హెూలీ స్టిక్ కార్డులను పరిశీలించడం జరిగింది. కార్యక్రమం అలాగే రగ్బీ ఆటలో విజయం సాధించిన విద్యార్థులు శ్రీజ వైష్ణవి గిరిజ నిత్య లకు పిఈటి మాస్టర్ ఎన్ శ్రీధర్ విలువైన బహుమతులను వారికి కార్యక్రమం సోమాపద్మా రత్నం వందన సమర్పణతో ముగిసింది.

# జిల్లాలోని 2,600 పాఠశాలలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 3.0 : కలెక్టర్ హిమాన్షు శుక్లా

**- హెచ్‌పిసి కార్డుల వల్ల విస్తృత ప్రయోజనాలు ఉన్నాయి : కలెక్టర్ హిమాన్షు శుక్ల - ఏపి పేరెంట్, టీచర్ల సమావేశ ముఖ్య ఉద్దేశం పిల్లల యొక్క అవసరాలను తీర్చడంతోపాటు వారి యొక్క పురోగతిని అంచనా వేయడమే : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** హెచ్‌పిసి (హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్) వల్ల పిల్లలు యొక్క అన్ని విధాన ఆక్టివిటీస్ పై అవగాహన కల్పించేందుకు అవకాశం ఏర్పడిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శుక్రవారం గుడ్లూరు మండలం చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో స్థానిక కందుకూరి శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలో విద్యా బోధన విధానాన్ని నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడా పరికరాల మరియు పుస్తకాల ప్రదర్శనను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో తరచూ ఒకరితో ఒకరు మాట్లాడుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. విద్యార్థులు బయట ఒక రకంగా తోటి స్నేహితులతో ఒక రకంగా ఇంట్లో ఒక రకంగా మసులుకుంటారని దాన్ని తరచూ తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా 17 సంవత్సరాల వయసులో తెలుసుకోవాల్సిన విషయాలన్నీ 10 సంవత్సరాలకే తెలుసుకుంటున్నారని పిల్లలలో చరవాణీ (మొబైల్)ల వాడకం తగ్గించాలని తద్వారా కళ్లపై శ్రమ పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొంతమందిలో మానసిక ఒత్తిడికి లోనై మంద బుద్ధి ఏర్పడుతుందని దానిని నివారించాలని ఆయన అన్నారు. నేడు జిల్లాలోనివ 2600 పాఠశాలలు 26 కాలేజీలలో ఈ ఆత్మీయ సమావేశం నిర్వహించుకోవడం జరుగుతుందని ఇందులో సుమారుగా 1,77,000 మంది విద్యార్థిని విద్యార్థులు పదివేల మంది దాకా టీచర్లు మరియు ఎస్ఎంసి సభ్యులు తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయుడు విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి తల్లిదండ్రులకు తెలియజేయాలి అన్నారు. స్థానిక కందుకూరి శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యా శాఖలో సంస్కరణలు చాలా వచ్చాయని రాష్ట్రస్థాయిలో తల్లికి వందనం ద్వారా పిల్లలను ప్రోత్సహించే విధంగా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలలో విద్యను అందిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలలో స్థలం ఎక్కువ ఉంటుందని తద్వారా ఆటలాడుకోవడంతోపాటు మానసిక, శారీరక ధైర్యాన్ని పొందవచ్చు అన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం జరిగిందన్నారు. విద్యా సంవత్సరం మొదలవగానే పాఠ్య పుస్తకాలతో పాటు నాణ్యమైన బట్టలు, బూట్లు అందించడం జరుగుతున్నదని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంలో నాణ్యమైన బియ్యాన్ని వాడి విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు.

సర్వ శిక్ష అభియాన్ అధికారి వెంకటప్పయ్య మాట్లా డుతూ మెగా పిటిఎం 3.0 ముఖ్య ఉద్దేశం విద్యార్థుల మధ్య సమన్వయం ఏర్పడుట అని గతంలో ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే ఈ ప్రక్రియ నడిచేదని ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నిర్వహించుకోవడం గొప్ప విషయం అన్నారు. హోలీస్టిక్ కార్డుల వలన విద్యార్థుల ప్రోగ్రెస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. పాఠశాలలో 12 గదులు ఉన్నాయని గదులు ల్యాబ్ వరకు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పాఠశాలలో ఆరు నుండి పది వరకు క్లాసులు ఐదు సెక్షన్ల ద్వారా నిర్వహిస్తున్నామని మొత్తం 120 మంది దాకా విద్యార్థులు ఉన్నారన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని 100 శాతం అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ చిన్న వెంకయ్య, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, మండల అధికారులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఉపాధ్యాయులతో పాటూ తల్లిదండ్రులూ తమ బిడ్డలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి - తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య మంచి అనుబంధాలకు వేదిక మెగా పేటీఎం**
**- రేపటితరం భవిష్యత్ కోసం విద్యపై ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది - క్రమశిక్షణ, పట్టుదల, చిత్తశుద్ధిని అలవరచుకుంటే విజయాలు విద్యార్థుల సొంతం**
**- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి - చేజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పండుగ వాతావరణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం**





**చేజర్ల, (రాజధాని వార్తలు):** విద్యార్థులకు విలువతో కూడిన విద్యను అందించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఆత్మకూరు నియోజకవర్గం చేజర్లలోని జడ్పీ హైస్కూల్‌లో మెగా పేటిఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం) కార్యక్రమాన్ని ఆహ్లాదకరవాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారా యణరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఒక మంచి అనుబంధం ఉండాలని, పాఠశాలలను సమాజానికి మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు మెగా పేటీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తమ బిడ్డల బాగోగులు, పాఠశాల హాజరు శాతం, విద్యార్థుల ప్రగతి నివేదికలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మొదలైన విషయాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య అర్థవంతమైన చర్చ జరిగి, సమస్యల పరిష్కారానికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ సమావేశం వేదిక కానుందని మంత్రి వివరించారు. కేవలం ఉపాధ్యాయుల పర్య వేక్షణ మాత్రమే కాకుండా ఇంట్లో కూడా తల్లిదండ్రులు తమ బిడ్డలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులది, విద్యార్థులది విడదీయలేని అనుబంధమన్న మంత్రి, విద్యార్థు లందరూ తమ గురువులను గౌరవించాలని సూచించారు. క్రమ శిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను అధిగమించి పాఠశాలకు, సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకు రావాలని పిలుపునిచ్చారు. రేపటి తరం భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలనే దృఢసంకల్పంతో విద్యారంగంలో అనేక సరికొత్త సంస్కరణలను కోట్లాది రూపాయలతో తమ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న విద్యావిధానాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా పరిశీలించి అత్యుత్తమ విద్యాప్రమాణాలను మన విద్యార్థులకు అందించేందుకు విద్యావ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన పౌష్టికాహారం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు, లీప్ యాప్ ద్వారా విద్యార్థుల ప్రగతి మొదలైన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యాలయాల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని, తామంతా ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి ఉన్నతస్థానాలు సాధించినట్లు మంత్రి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. తొలుత విద్యార్థులు ఏర్పాటుచేసిన శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన ప్రదర్శనలను మంత్రి సందర్శించి, విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. ప్రయోగాల పనితీరును మంత్రికి విద్యార్థులు వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరికి ఆకట్టుకున్నాయి. పాఠశాలలో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు మంత్రి చేతుల మీదుగా జ్ఞాపికలను అందించారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో భాగంగా సహపంక్తి భోజనం చేశారు. భోజన మెనూ ఎలా వుంది, అన్ని ఆహార పదార్థాలు బాగున్నాయా? అని విద్యార్థులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, డిడివో రమణయ్య, డిప్యూటీ డిఇవో జానకిరాం, ఎంపిడివో అమర్, తహశీల్దార్ మస్తానయ్య, ఎంఇవోలు ఇందిర, మస్తానయ్య, పాఠశాల హెచ్ఎం శ్రావణ్, అసిస్టెంట్ హెచ్ఎం రమేష్‌బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బెత్తం దెబ్బలు తీపి గుర్తులుగా మిగిలిపోవాలి

**- దెబ్బలు తిన్న చేతులే... నేడు జాతీయస్థాయిలో సంతకాలు చేస్తున్నాయి - ఆనాటి విద్యార్థుల గురుభక్తిని నేటి విద్యార్థులతో పంచుకున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి - ఉపాధ్యాయులది, విద్యార్థులది గొప్ప అవినావభావ అనుబంధం : మంత్రి ఆనం**





**చేజర్ల, (రాజధాని వార్తలు):** ఆనాటి గురువుల బెత్తం దెబ్బలు తీపి జ్ఞాపకా లుగా మిగిలిపోయాయని, దెబ్బలు తిన్న అరచేతులే నేడు ఉన్నత స్థానాల్లో సంతకాలు చేస్తున్నాయని ఆనాటి సంగతులను, గురువుల గొప్పతనాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేటి తరం విద్యార్థులకు వివరించారు. ఇందుకు చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఆత్మీయ సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సోషల్ మీడియాలో వచ్చిన ఒక వీడియోను విద్యార్థులకు విద్యార్థులకు చూపించారు. ఆ వీడియోలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత రంగాల్లో మంచి గుర్తింపు పొందిన వారందరూ, తమకు బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయురాలిని గుర్తు పెట్టుకొని ఆమె వద్దకు వచ్చి, ఆమెతో వారి అనుబంధాన్ని గుర్తు చేసుకోవడం, తాము ఆనాడు తిన్న బెత్తం దెబ్బలను అరచేతులను చూపించి మళ్లీ కొట్టమని అడగడం వంటి మధురమైన దృశ్యాలను విద్యార్థులకు మంత్రి చూపించి, బెత్తం దెబ్బల మాధుర్యాన్ని, గురువులకు, విద్యార్థులకు ఉన్న అవినావభావ అనుబంధాన్ని నేటితరం విద్యార్థులకు వివరించారు.

నేటితరం విద్యార్థులందరూ గురువులను, తల్లిదండ్రులను గౌరవిస్తూ సత్ప్రవర్తనతో ముందుకు సాగితే విజ యాలను అందిపుచ్చుకోవచ్చని, మంచి పౌరులుగా రాణించి సమాజానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి ఆనం విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సోషల్ మీడియా వీడియోను మంత్రి ఆనం విద్యార్థులకు వివరించిన తీరు ప్రతి ఒకరిని ఆలోచింపజేసింది... విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా మెగా పీటీఎం కార్యక్రమం

**- ఆత్మీయ సమావేశానికి తరలి వచ్చిన విద్యార్థుల తల్లితండ్రులు - వీఆర్సీలో మెగా పీటీఎం 3.0 లో పాల్గొన్న మంత్రి నారాయణ - థాంక్యూ లోకేష్ సార్ అంటూ హోరెత్తించిన విఆర్సీ విద్యార్థులు**





**చేజర్ల, (రాజధాని వార్తలు):** మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో పాల్గొనటం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడోసారి మెగా పేరెంట్ టీచర్ మీటెంగ్ నిర్వహించుకొం టున్నాం. గత డిసెంబర్ ఏడో తేదీన, ఈ ఏడాది జూలై 10న రెండు సార్లు మెగా పీటీఎం నిర్వహెంచుకున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 61,000 విద్యా సంస్థలు, 74,96,228 మంది విద్యార్థులు, 3,32,770 మంది ఉపాధ్యాయులు, 1,49,92,456 తల్లితండ్రులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. యువనేత లోకేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నెల్లూరులోని నాలుగు స్కూల్స్‌లో మెగా పీటీ ఎంలో నేను పాల్గొన్నాను. విఆర్సీలో పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశాను. పిల్లలు చాలా సంతోషంగా ఉన్నారు. రాష్ట్రంలో తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది అకౌంట్స్‌లో 10 వేల కోట్లు వేసిన ప్రభుత్వం మాది. స్కూల్స్ అభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నారు. సిటీలోని పదిహేను హైస్కూల్స్‌ని అంతర్జాతీయ ప్రమాణాలతో వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధం చేస్తాము. నేను ఉపాధ్యాయుడిగానే నా జర్నీ ప్రారంభించా. కష్టపడి ఉన్నత స్థాయికి చేరాను. దేశవ్యాప్తంగా నారాయణ విద్యా సంస్థలను విస్తరింప చేశా. వాటి బాధ్యతలు నా పిల్లలకి అప్ప చెప్పాను. నారాయణలో 6,50,000 మంది విద్యార్థులు, 50,000 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు నారాయణ విద్యాసంస్థల సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది. మా నాన్న ప్రయివేట్ బస్సు కండక్టర్. మా అమ్మ చదువుకోలేదు. పేదరికం నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదిగాను. పెదరికం ఎదుగుదలకు ఆటంకం కాదు. బాగా చదువుకొంటే పేదరికాన్ని జయించి ఉన్నతస్థాయికి ఎదగొచ్చు. సీఎం ప్రవేశ పెట్టిన పి 4 ద్వారా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిఈఓ బాలరాజు, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, సుజన్, డాక్టర్ పోకల రవి, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సంఘ అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోండి : డి.ఆర్.డి.ఏ పి.డి శ్రీనివాస్ పాణి




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** సంఘాల అభివృద్ధికి సభ్యులు ప్రణాళికయుతంగా పనిచేయాలని డిఆర్డిఏ పిడి శ్రీనివాస్ పాణి అన్నారు. శనివారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి విజన్ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విజన్ బిల్డింగ్ ట్రైనింగ్లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో చూపాలన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో ప్రతి సభ్యురాలు తమ వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబం అభివృద్ధి, సంఘం అభివృద్ధి, గ్రామ సంఘ అభివృద్ధి పరుచుటకు అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. అనంతరం జండర్ లింగ వివక్షత అంశంపై మహిళలందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం బ్యాంకు లింకేజీ లక్ష్మ నాయుడు, స్త్రీనిధి ఏజీఎం చిట్టిబాబు, ఏపీఎం పి.నారాయణరావు, వి.విశ్వేశ్వర రావు, ఎల్.పద్మ, పి.శేషగిరిరావు, ఆరు మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

# మక్కువలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించిన ఎంపీడీవో అర్జున్ రావు

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ గ్రామ పంచాయతీలో ఎంపీడీవో అర్జునరావు ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అంటూ ప్రజలకు తెలియజేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలమూత్రాలు విసర్జించరాదని. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని ప్రతి ఇంటి వద్ద తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చెత్త డబ్బాలలో వేయాలని సూచించారు. మురుగునీరు నిలువ ఉండకుండా ప్రజలు జాగ్రత్త పడాలని తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి ప్రజా ఆరోగ్యం కాపాడుకోవడానికి దోహద పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బెహరా



శ్రీనివాసరావు మరియు సచివాలయ సిబ్బంది ఆశా వర్కర్లు అంగన్వాడీ సిబ్బంది వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కోవూరు చెరువు పరిసర ముంపు ప్రాంతాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**- 10 లక్షలతో చెరువు కట్ట పటిష్టతకు చర్యలు - ఎడ తెరిపి లేని వర్షాలతో చెరువు పరిసర జనవాసాలు జలమయం - ముంపు ప్రాంత వాసులకు పరామర్శ, భోజన వసతి తదితర సహాయక చర్యలకు ఆదేశాలు**









**కోవూరు. (రాజధాని వార్తలు):** కోవూరు చెరువు కట్టపై ప్రమాదకర పరిస్థి తులలో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తర లించి చెరువు కట్ట పటిష్ట పరుస్తామన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ముంపుకు గురైన చెరువు పరిసర ప్రాంతాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు.

గుమ్మళ్ల దిబ్బ హైస్కూల్ లోని పునరవాస కేం ద్రంలో ఉంటున్న వరద బాదితులకు భోజనం వసతి కల్పించాలని ఆమె అధికారులను ఆదేశించారు. బలహీనంగా ఉన్న చెరువు కట్ట, కలుజ ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. చెరువు పరిసర ప్రాంతంలో జనవాసాలకు భవిషత్తులో ఎటువంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకు 10 లక్షలతో చెరువు కట్ట పటిష్ట పరుస్తున్నట్టు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. చెరువు కట్ట పై నివాసం ఉంటున్న 70 కుటుంబాల వారికి పక్కా ఇళ్ళు, ఇళ్ల స్థలాలు మంజూరై ఉన్నాయని వారిని అక్కడికి తరలించి చెరువు కట్ట పటిష్టత పనులు చేపడతామన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు, కోవూరు మండల టిడిపి అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఇంత మల్లారెడ్డి, యాకశిరి వెంకటరమణ రమణమ్మ, సాయి రెడ్డి మరియు హౌసింగ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan